## క్లుప్తంగా

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఇంజేడులో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఐటా నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఐటా (ఆలిండియా ఐడియల్ టీచర్స్‌అసోసియేషన్) ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో శనివారం నూతన కమిటీ ఎన్నికలు అధ్యక్షుడు చాంద్ బాషా, సెక్రటరీ నజీర్ అహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ సలీం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఇర్ఫాన్, ట్రెజరర్‌గా అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడిగా సుకూర్, జాయింట్ సెక్రటరీగా కరీముల్లా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను మౌఖిక ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నట్లు చాంద్‌బాషా తెలిపారు. ఎన్నికల్లో వెలుగోడు, బనగానపల్లె, నందికొట్కూరు, నంద్యాల యూనిట్లు పాల్గొన్నాయని చెప్పారు.

### నిబంధనలు పాటించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

రుద్రవరం: రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ సూచించారు. మండల పరిధిలోని ఆలమూరులో శనివారం ఆయన ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు కారణమైతే జైలు శిక్షతోపాటు జరిమానా తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి ఉన్నారు.

### దంత వైద్యుడికి పురస్కారం



కిశోర్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం ): తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేసిన పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు కిశోర్ కుమార్‌ను శనివారం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో ఘనంగా సత్కరించి పురస్కారం అందజేశారు. డాక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తెలుగు భాషా వ్యాప్తికి, పరిరక్షణకు కృషి చేయడంలో భాగంగా పుస్తక రచనలు, కవితలు రాశానని చెప్పారు. కార్యక్రమంలో పత్తి ఓబులయ్య, కల్కూర చంద్రశేఖర్, జె.ఎస్.ఆర్.కె శర్మ, దండెబోయిన పార్వతి, ఖండే సునీత, సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

### అలరించిన గాత్ర కచేరి




భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన సంధ్యా త్రివేణి, బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. శక్తి సహిత గణపతి, ముదాకరాత్త మోదకం, కైలాసగిరిలోన, శంకర శివశంకర, నమః శివాయా నటేశ్వరాయ, శంభో శివశంభో, పాహి పాహి గజననా తదితర గీతాలను రేణుశ్రీ, జ్ఞన, లాస్యప్రియ, నందిని, గోపి, సంధ్యా త్రివేణి తదితరులు ఆలపించారు.

### ఆక్రమణల తొలగింపు

మహానంది: స్థానిక పార్వతీపురం కాలనీ వద్ద రోడ్డు పక్కనే ఉన్న అటవీశాఖ భూమిలో ఏర్పాటు చేసిన దుకాణాలు, హోటళ్లను అటవీశాఖ అధికారులు శనివారం తొలగించారు. డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓలు ప్రతాప్, శ్రీనివాసులు, సిబ్బంది దుకాణాల వద్దకు చేరుకుని దుకాణాలను తొలగించారు. మిగతా దుకాణాలకు గడువు ఇచ్చారు.

#### ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బైక్‌లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శ్రీశైలం పట్టణ పోలీసు స్టేషన్‌కు ప్రభుత్వం రెండు ద్విచక్రవాహనాలు అందించింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆలయ పరిసరాలలో రాత్రి, పగలు గస్తీ తిరిగేందుకు వాహనాలను ఉపయోగిస్తామని సీఐ జి.ప్రసాదరావు తెలిపారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర



రుద్రవరంలో సాగుతున్న జగన్నాథ రథయాత్ర

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో శనివారం జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. గ్రామంలోని సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి మొదలై బెస్త కాలనీ, అమ్మవారిశాల కూడలి, డొంక రస్తా, పెద్దమ్మ కాలనీ, పడమటి వీధుల్లో జగన్నాథ రథయాత్రను సాగించారు. కార్యక్రమంలో అహోబిలం, నంద్యాల, పొద్దుటూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తాదులతో పాటు ఇస్కాన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హరే కృష్ణ మంత్రాలు జపిస్తూ ప్రజల్లో భక్తి పారవశ్యాన్ని నింపుతూ రథోత్సవం సాగించారు. అర్చకులు నిత్య తృప్తిదాస్ రథయాత్ర విశిష్టతను ప్రజలకు వివరించారు. రథోత్సవం ముగియగానే జగన్నాథుడిని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు.

## పోటెత్తిన కుందూ!



కుందూలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

దొర్నిపాడు మండల పరిధిలోని కుందూనదికి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు పోటెత్తింది. గత రెండు రోజుల కంటే శనివారం వంతెనకు రెండు అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం పెరిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. కుందూలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీపరివాహక ప్రాంత రైతులు వరి నాట్లకు సమాయత్తం అవుతున్నారు. – దొర్నిపాడు

### ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి అనంతపురం పట్టణానికి చెందిన లింగారెడ్డి షణ్ముఖరెడ్డి, శ్వేత దంపతులు రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు దాతలను పూలమాల, దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు.

## గుంతలను పూడ్చండి



దొర్నిపాడు, ఉయ్యాలవాడ రహదారిలో దెబ్బతిన్న రోడ్డు



ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ నుంచి దొర్నిపాడుకు వెళ్లే రహదారి పూర్తిగా ప్రమాదకరంగా మారింది. రెండు నుంచి మూడు అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. పూడ్చివేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు. 2016–17 సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఉయ్యాలవాడ నుంచి 13.25 కిలోమీటర్ల దూరంలో వున్న దొర్నిపాడును కలుపుతూ అప్పట్లో రూ.7.85 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం తారు లేచిపోయి దాదాపు 6 కిలోమీటర్ల పొడువునా రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రైతుల రాకపోకలతోపాటు రెండు గ్రామాల ప్రజలు ఇదే రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిన సందర్భాల్లో వేగంగా వెళ్లే వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని రహదారికి మరమ్మతులు చేపట్టాలని రైతులు, పాదాచారులు వేడుకుంటున్నారు.

## మధ్యవర్తిత్వంతో అనేక లాభాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాదులు

కర్నూలు(అర్బన్): మధ్యవర్తిత్వం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ శివరామ్, మీడియేటర్స్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రసాద్ చెప్పారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ విభాగం సూచనలు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 90 రోజులు జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించి కేసులను త్వరగా పరిష్కరించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. మధ్యవర్తిత్వం ప్రక్రియలో సమయం వృథా కాదని, ముఖ్యంగా డబ్బు కూడా వృథా కాదన్నారు. ఈ నేపథ్యంలోనే వారు మధ్యవర్తిత్వం– దేశం కోసం అనే బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ట్రయినింగ్ న్యాయవాదులు బాలాజీ, సుమలత, వినోద్‌కుమార్, న్యాయవాది ప్రేమ్‌కుమార్, ప్యారా లీగల్ వలంటీరు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, రామ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలను శనివారం కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగు గుర్తించాలన్నారు. సమ్మె కాలంలో ఒప్పందాలను, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను చెల్లించాలన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు, జయన్న, తిమ్మయ్య, రాజా, సురేష్, సామక్క, సువర్ణమ్మ పాల్గొన్నారు.

## యువత వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ దేవరాజు మహారాజు

కర్నూలు(సెంట్రల్): యువత వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని, అప్పుడు దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజు మహారాజు పేర్కొన్నారు. శనివారం కర్నూలులోని బీఏఎస్ కల్యాణ మండపంలో విద్యా–వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు యువతను మతచాంధస వాదం వైపు బలవంతంగా నెట్టుతున్నాయన్నారు. మూఢనమ్మకాలను నమ్మితే సమాజం ముందడుగు వేయదన్నారు. సమాజాభివృద్ధికి సైన్స్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఎప్పుడూ నిజాన్ని మార్చలేరని, అబద్ధం తాత్కాలికంగా విజయం సాధించిన అది నిలువదన్నారు. విద్యలో మత సంబంధం అంశాలను చెప్పించే కుట్ర జరుగుతోందని, ఇది ప్రజాస్వామిక, లౌకిక తత్వాలకు విరుద్ధమన్నారు. దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని సూచించారు. విజ్ఞానం భవిష్యత్ తరాల ఆస్తి అని, దానిని పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఉర్దూ యూనివర్సిటీ డీన్ అక్తర్ బాను, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు ప్రసాదుశర్మ, రంగస్వామి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, సుధీర్ పాల్గొన్నారు.

## రాయమాల్పురంలో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నంద్యాల(అర్బన్): మండలంలోని రాయమాల్పురం గ్రామంలో ఏసుకృప మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు అందనం ఏసన్న శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు కంటి, చెవి పరీక్షలు నిర్వహించి కళ్లజోడు, చెవి మిషన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు పబ్బతి విజయమోహన్, మనోజ్‌కుమార్, రత్నాకర్ పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

### శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్



లింగాలగట్టు వద్ద నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్ అయింది. శ్రీశైలం నుంచి హైదరాబాద్ రహదారిలో సుమారు ఐదు కిలోమీటర్లకు పైగా ట్రాఫిక్ జామ్ అయింది. శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్లు తెరవడంతో శనివారం సెలవు రోజు కావడంతో తెలంగాణ ప్రాంతం నుంచి భారీగా భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. డ్యాం వద్ద పలువురు పర్యాటకులు వాహనాలను నిలుపుదల చేసి డ్యాంను సందర్శించడంతో వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ జామ్‌కు కారణమైంది. లింగాలగట్టు వద్ద కూడా వాహనాలు నిలుపుకుని చేపల విక్రయాలు జరపడం ట్రాఫిక్ జామ్‌కు మరో కారణంగా తెలుస్తోంది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్ జామ్‌ను క్రమబద్ధీకరించారు.

### పేద ముస్లింలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): వివాదాస్పదంగా మారిన వక్ఫ్‌బోర్డు భూముల్లో పేద ముస్లింలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫకృద్దీన్, సీపీఐ పట్టణకార్యదర్శి ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు శ్రీనివాసులు, సుశీలమ్మ, హబీబ్‌బేగ్ పాల్గొన్నారు.

### రైతు కుటుంబాలను ఆదుకోవాలి

రుద్రవరం: అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, రుద్రవరం మండల సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం ఒక్క రోజే ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### వ్యక్తికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు మెట్ట సమీపంలో శనివారం విద్యుత్ స్తంభాలు అమర్చేక్రమంలో రంగన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కొద్ది రోజులుగా శిరివెళ్ల మండలం గోవిందపల్లెకు చెందిన కొందరు కూలీలు రుద్రవరం మండలంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెద్దకంబలూరు మెట్ట సమీపంలో విద్యుత్ స్తంభం అమర్చేందుకు యంత్రంతో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ యంత్రం రంగన్న ముఖానికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో రెండో శనివారం, ఆదివారం రోజుల్లో స్కూల్, కాలేజీలు నిర్వహిస్తూ ప్రైవేటు టీచర్లను, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శివ, నాగన్న డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలకు సెలవులను వర్తింపజేస్తున్నా..విద్యా రంగంలో మాత్రం అవి అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా పట్టణంలో ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నా యంత్రాంగం పట్టించుకోకపోవడాన్ని చూస్తే.. వారు సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు సెలవుల్లో తరగుతుల నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సనాయకులు హర్ష, అజయ్, సంజయ్ పాల్గొన్నారు.

### 15న యాగంటిలో బహిరంగవేలం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్ర పరిధిలో ఐస్ క్రీం, పండ్లు, బొమ్మలు, రుద్రాక్షధారాలు, రుద్రాక్ష మాలలు, కరుంగలి మాలలు, పూసలమాలలు, రాగి కడియాల విక్రయానికి హక్కుల కోసం ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు అవసరమైన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఆలయ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఈవో పేర్కొన్నారు.

### కారు–ఆటో ఢీ

మహానంది: మహానందిలోని పార్వతీపురం టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి ఆటో, కారు ఢీకొన్నాయి. నరసరావుపేట పట్టణానికి చెందిన పలువురు భక్తులు మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో గాజులపల్లె వైపు ఉన్న టోల్ గేట్ వద్ద ఆటో, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారుకు డ్యామేజ్ అయిందని బాధితులు చెప్పారు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి వివరాలు సేకరించారు.

### వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ వేధింపులకు గురిచేస్తున్నారని కోడలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలు.. పట్టణంలోని ఆసర్‌పేట కాలనీకి చెందిన షేక్ నజ్రీన్‌కు బేతంచెర్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఇద్రూస్ వలితో 2 నెలల క్రితం వివాహం జరిగింది. అయితే కొద్ది రోజులుగా భర్త ఇద్రూస్ వలి, మామ ఇద్రూస్ బాషా, అత్త మౌలాబీ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని కోడలు షేక్ నజ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

## కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ముందుగా వేద పండితులు గణపతిపూజ, పున్యహవాచనం, కంకణ పూజ, కంకణ ధారణ, యజ్ఞోపవిత ధారణ, మధుపర్క సమర్పణ, పాద ప్రక్షాళన, మాంగళ్యపూజ, పట్టు వస్త్రాల సమర్పణ గావించారు. మంగళ్య ధారణ, తలంబ్రాలు, దండల మార్పిడి, అమ్మవార్లకు ఒడిబియ్యం, మహనైవేద్య తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రైతు ఆత్మహత్యలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల (న్యూటౌన్):రైతు ఆత్మహత్యలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నరసింహయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని రుద్రవరం, బండిఆత్మకూరు మండలాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయన్నారు. పెట్టుబడులు పెరిగి పోవడం, దిగుబడులు పడిపోవడం, అరకొరగా వచ్చిన పంటలకు మద్దతు ధర లభించక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ విధానాలను అనుసరించడం వల్ల వారి ఆస్తులు తరిగిపోతున్నాయన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉన్నా.. పాలకులు సకాలంలో కాలువలకు నీరు వదలక పోవడం వల్ల మెట్ట పైర్లు ఎండిపోతున్నాయన్నారు. ఎరువులు, యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నా రైతులు మాత్రం సొసైటీల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారని మండిపడ్డారు. సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సురేష్ పాల్గొన్నారు.

## అ‘పూర్వ’ సమ్మేళనం



కళాశాల చైర్మన్ దంపతులను సన్మానిస్తున పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణడిగ్రీ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1998 – 2002 వరకు చదివిన ఎంపీసీ,ఎంబీపీ,ఎమ్మెస్సీ, బీసీఏ,ఎంకాం కోర్సుల 16 బ్యాచ్‌ల విద్యార్థులు కలుసుకున్నారు. విదేశాలతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కళాశాలలో కలుసుకోవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఒకరి నొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం కళాశాల చైర్మెన్ రామకృష్ణారెడ్డి, విజయకుమారిని పూర్వవిద్యార్థులు సన్మానించారు. ఆ సందర్భంగా బ్లైండ్ స్కూల్‌కు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ర్యక్రమంలో డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు సురేష్‌కుమార్,భార్గవి,మదు,నాగేంద్ర, మహేంద్రగౌడ్ వెంకట్రావు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమాలు చేయిస్తున్న భక్తులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలోని యాగశాలలో శనివారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ ఆధ్వర్యంలో భక్తులు రుద్ర, చండీ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్ర, చండీ, మహా మృత్యుంజయ హోమాలు చేసుకున్నారు.

- ఆషాడమాసం పురస్కరించుకుని నంద్యాల, మహానంది గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారికి చీర, సారె సమర్పించారు.

## మహానందిలో న్యాయమూర్తి పూజలు



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న న్యాయమూర్తి భాస్కర్, కుటుంబసభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆళ్లగడ్డ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భాస్కర్, కుటుంబ సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

### మద్దిలేటి స్వామికి విశేష పూజలు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ఆవరణ

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆషాడ మాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## అప్పు తీర్చే మార్గం లేక ఉద్యోగి ఆత్మహత్య

కర్నూలు: ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కర్నూలు పశుసంవర్ధక శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుద్యాల శేషేంద్ర నాథ్ (48) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారెడ్డి వెంచర్‌లో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందుకోసం బ్యాంకులో రూ.48 లక్షలు అప్పు చేశాడు. అలాగే పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం కూడా బయట మరికొంత అప్పులు చేశాడు. వచ్చే జీతం బ్యాంకు ఈఎంఐ చెల్లింపులతో పాటు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటికి సమీపంలోని మసీదు దగ్గర ఉన్న బహిరంగ ప్రదేశంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు కనుగొని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించగా కోలుకోలేక శనివారం ఉదయం మృతిచెందాడు. ఈయనకు వేణుమాధవ్, భానుకిరణ్ కుమారులు. భార్య దుద్యాల మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.